పేదలకు 'స్పెషలిస్టు' వైద్యం

- కృష్ణాజిల్లాలో విస్తృతంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- స్థానికంగానే స్పెషలిస్టు వైద్య సేవలు
- శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన
- ఇప్పటి వరకూ 352 వైద్య శిబిరాలు నిర్వహణ
- 1,96,604 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షల అనంతరం మందులు తీసుకుంటున్న రోగులు



అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందం

కంకిపాడు(పెనమలూరు): ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జగనన్న ఆరోగ్య సురక్షతో స్పెషలిస్టు వైద్య సేవలను ప్రజల చెంతకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకుంది. వైద్య పరీక్షలతో పాటుగా నాణ్యమైన మందులు, కార్పొరేట్‌కు తీసిపోని విధంగా వైద్య పరీక్షలు చేయిస్తోంది. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో ఆరోగ్యంపై ధీమా ఏర్పడుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ స్థాయిలో వైద్య సేవలు..

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలకు వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోంది. గత నెల 30వ తేదీ నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను చేపట్టారు. ఈనెల 24వ తేదీ నాటికి కృష్ణాజిల్లా వ్యాప్తంగా 352 వైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో 1,96,604 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్య సేవలు పొందిన వారిలో పురుషులు 94,688, మహిళలు 1,01,916 మంది ఉన్నారు. అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించేందుకు ల్యాబ్, ఈసీజీ, కంటి వెలుగు, స్పెషలిస్టు వైద్యులతో వైద్య సేవలు, సలహాలు, సూచనలు అందుతున్నాయి. తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న 2,814 మందిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 1,96,596 మందికి మందులు అందించారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి కంటి సంరక్షణ కోసం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలను ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 32,507 మందికి ఈ శిబిరాల్లో కంటి వైద్యసేవలు అందాయి. 89 రకాల ఔషధాలు, 14 రకాలు అత్యవసర ఔషధాలను అందిస్తున్నారు.

రోగుల ఆరోగ్య సమాచారం నిక్షిప్తం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యం పొందిన రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. రోగి పేరు, సమస్య, అందుకు గల కారణాలు, గతంలో పొందిన వైద్య సహాయం వివరాలను కూడా పొందుపరుస్తున్నారు. రోగి ఆరోగ్య సమాచారం పూర్తి స్థాయిలో భద్రపరిచి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక ప్రభుత్వ పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టింది.

వివిధ వ్యాధులకు సంబంధించిన నిపుణులతో వైద్య పరీక్షలు

శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. వివిధ వ్యాధులకు సంబంధించిన నిపుణులు శిబిరాలకు వచ్చి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నారు. వైద్య పరీక్షలతో పాటుగా ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. శిబిరాల నిర్వహణలో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను కల్పించి వైద్య సేవలు మెరుగ్గా, నాణ్యతాయుతంగా అందిస్తుండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యంపై భరోసా..



అన్ని రకాల వ్యాధులకూ శిబిరంలో వైద్య సహాయం అందుతోంది. వైద్యులు ఎంతో ఓర్పుతో పరీక్షించి వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యంపై భరోసా కల్పిస్తున్నారు. మందులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

– గుడిసే వెంకట ఏసుకుమారి, కంకిపాడు

ఎన్నడూ చూడలేదు..



గ్రామాల్లోకి పెద్ద డాక్టర్లు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయటం, మందులు అందించటం గతంలో ఎప్పుడూ చూడలేదు. వైద్య శిబిరాల నిర్వహణ బాగుంది. ఈ ప్రభుత్వంలో మా వైద్యానికి ఎంతో ప్రాధాన్యం దక్కింది. ఆరోగ్యంపై భరోసా కల్పించేలా వైద్య సేవలు ఉన్నాయి.

– కురగంటి జగ్గారావు, గొడవర్రు

సంతృప్తికర స్థాయిలో..



ప్రజారోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. లక్ష్యానికి అనుగుణంగా ప్రజల సంతృప్తికర స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి. వైద్య శిబిరాల నిర్వహణ సమర్థవంతంగా సాగుతోంది. ప్రజల నుంచి శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. మెరుగైన వైద్యసేవలు అందేలా నిరంతరం శిబిరాలను పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ గీతాబాయి, డీఎంహెచ్‌ఓ, కృష్ణాజిల్లా

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఉయ్యూరు నూతన ఆర్డీఓ



పెనమలూరు: ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు బుధవారం రాత్రి తాడిగడపలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉయ్యూరు ఆర్డీఓగా రాజును ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఆయన విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథిని కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పెనమలూరు తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పి.నైనవరంలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామం బీసీ ఏరియాలో గత కొన్నేళ్లుగా నెలకొని ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామంలో డ్రైన్ల నిర్మాణం పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు బీసీ ఏరియాలో ప్రజలు డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ కాల్వల సదుపాయం లేక ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉంటుందని, దాని వలన ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పి.నైనవరం గ్రామం బీసీ ఏరియాలో అయిదు ప్రాంతాల్లో డ్రైన్లు నిర్మించడానికి రూ.20లక్షలను మంజూరు చేశారు. ఆ నిధులతో డ్రైన్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయని ఏఈ ఎస్.శివరామకృష్ణ తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో లూర్దుమాత తేరు ఊరేగింపు


గన్నవరం: స్థానిక దివ్య బాలయేసు ఆర్‌సీఎం చర్చి 8వ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం విచారణ గురువులు ఫాదర్ పసల థోమస్ ఆధ్వర్యంలో లూర్దుమాత స్వరూపంతో తేరు ఊరేగింపు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి నుంచి ప్రారంభమైన ఊరేగింపు పుర వీధుల్లో కొనసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని లూర్దుమాత గీతాలను ఆలపిస్తూ జపమాలను జపిస్తూ సాగారు. ఈ సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్‌లో బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ భక్తులకు సందేశం ఇచ్చారు. చర్చి పెద్దలు నీలం జాకోబ్, విజయకుమార్, దేవరాజు, పసల రత్నం, జీసస్ యూత్ సభ్యులు సుభాష్, ఆనంద్ మురళి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీల దీక్ష విరమణ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన భక్తులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పుష్కర్ ఘాట్, సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో పర్యటిస్తూ ఘాట్ వద్ద యాత్రికులు స్నానం చేసేందుకు గల సదుపాయాలు, కేశఖండనశాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంత పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవానీల దీక్ష విరమణ సమయంలో వారు వదిలేసే వస్త్రాలను ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్ల వద్ద మెరుగైన పారిశుద్ధ్య పరిస్థితులను నెలకొల్పి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. యాత్రికులకు అందుబాటులో ఉంచిన తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి, హెల్త్ ఆఫీసర్–3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని త్రిశక్తి పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం పండితులు మూర్తి సూర్య ప్రకాష్‌శాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు, భవానీలకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులను పలకరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజలందరికీ నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామగ్రామాన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం రోగులకు వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్, జనరల్ మెడిసిన్, కంటి, దంత సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం ప్రాంగణంలో సమతుల పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. శిబిరంలో 823 మందికి వైద్య సేవలు అందించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కసుకుర్తి స్వరూపరాణి, మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష



తాడిగడపలో మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపటానికే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిగడపలోని 19 వార్డు సచివాలయాల్లో వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజారావు, వైఎస్సార్ సీపీ నేతలు మేడసాని రమేష్‌బాబు, కె.క్రిస్టోఫర్, ఖాదర్‌బాషా, నల్లమోతు జీవన్, తెన్నేటి ప్రకాష్, హెచ్‌ఎం కనకదుర్గ, గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నున్న గ్రామంలో వైద్య పరీక్షలు

నున్న(విజయవాడ రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది నున్న గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని మూడు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు టీములుగా ఏర్పడి వలంటీర్లు, ఆశ వర్కర్లు బీపీ, సుగర్, డెంగీ, మలేరియా, జ్వరాలు, ఇతర వ్యాధులకు సంబంధించిన వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరుకావాలని వారికి స్లిప్పులు అందజేస్తున్నట్లు మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షనల్ ఆఫీసర్ పెద్దిరావు తెలియజేశారు. గైనకాలజిస్ట్, పీడియాట్రిస్ట్, జనరల్ ఎండీ, కంటి వైద్యులు వైద్య శిబిరాలకు హాజరవుతారని, అవసరమైన వారికి ఈసీజీ కూడా తీస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.

అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం



సూరంపల్లిలో వైద్య సేవలు పరిశీలిస్తున్న ఎంపీపీ అనగాని రవి, నాయకులు

గన్నవరంరూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజల ఆరోగ్య రక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని గన్నవరం ఎంపీపీ అనగాని రవి అన్నారు. సూరంపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం ప్రభుత్వ లక్ష్యమని, ఆ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రజలందరి ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కందిమళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కొండా సీతారామయ్య, ఎంపీడీవో ఇ.సత్యకుమార్, వైద్యాధికారి ఆనందబాబు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్‌బాబు, సీఆర్పీ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

కాటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఉయ్యూరు: మండలంలోని కాటూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ ఆశాజ్యోతి ప్రారంభించారు. రోగులకు అవసరమైన వైద్యసేవలను వైద్య బృందం అందించింది. కార్యక్రమంలో ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, డాక్టర్ దీప, డాక్టర్ శాంతి శివరామకృష్ణ, డాక్టర్ రాకేష్ అనిల్, సీడీఓ వెలివెల రాజేశ్వరి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ప్రసాదంపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం–3 ఆవరణలో గురువారం ఉదయం 9.30 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జె.రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసే వైద్య శిబిరంలో పలు వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని వివరించారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, అధికారులు, నాయకులు హాజరవనున్నట్లు తెలిపారు.

నేడు వెల్దిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఉంగుటూరు: వెల్దిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వివిధ విభాగాల స్పెషలిస్ట్ వైద్య అధికారులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్నావారు, ఆరోగ్య పరీక్షలు చేయించుకునేవారు హాజరై వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తిస్తే ఆరోగ్య సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

పెనమలూరు: కృష్ణానది లంకల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణానది లంకల్లో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.14 వేలు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రేపు ఉంగుటూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులో స్త్రీశక్తి భవనం సమావేశం మందిరంలో ఈ నెల 27న మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ వి.సరోజిని అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బుడమేరు వంతెనకు మరమ్మతులు చేయాలి

జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి వినతి



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారులో బుడమేరు కాలువ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. బుధవారం వైస్ ఎంపీపీ కాలగడ్డ శివ నాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానికతో కలిసి ఆమె బుడమేరు వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నిర్మించిన బుడమేరు వంతెన శిథిలావస్థకు చేరుకుందన్నారు. వంతెన రోడ్డుపై గుంతలు పడడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు.

కాలువ కట్టల నివాసితులకు అండ

- రూ.లక్షలతో కట్టల అభివృద్ధి
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



తాడిగడప కాలువ కట్టపై గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: బందరు కాలువ కట్టలపై నివాసం ఉంటున్న పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రూ.లక్షలు వెచ్చించి కాలువ కట్టలు అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాడిగడప కాలువ కట్టలపై నివాసితులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు పంపిణీ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో కాలువ కట్టలను సుందరీకరణ చేస్తామని, ఇళ్లు తొలగిస్తామని నివాసితులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత కాలువ కట్టలపై నివశించే పేదలు భరోసాగా జీవిస్తున్నారని తెలిపారు. రూ.లక్షలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. సిమెంట్ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. కాలువ కట్ట నివాసితులకు ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను సీఎం చేస్తే కాలువ కట్ట నివాసితులు ఆనందంగా జీవించవచ్చని సూచించారు.

పలు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు...

పెనమలూరు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలని ఎమ్మెల్యే పార్థసారథి ఆర్టీసీ అధికారులతో చర్చించారు. తాడిగడప ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. తాను గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో తిరిగిన సమయంలో చాలామంది ఆర్టీసీ సిటీ బస్సులు కావాలని తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. కానూరు మురళీనగర్ సచివాలయం వరకు, కానూరు నవతా రోడ్డు, పోరంకి నారాయణపురం కాలనీ, మారేడుమాక వయా తెన్నేరు, మురళీనగర్ టు వయా కమలమ్మ బజార్ కానూరు వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులకు ఎమ్మెల్యే తెలుపగా అధికారులు సానుకూలంగా స్పందించారు.

సమూలంగా మారిన పల్లెసీమల రూపురేఖలు

- ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్
- రంగన్నగూడెంలో రూ.93 లక్షల విలువైన ప్రభుత్వ భవనాలు ప్రారంభం



సింగన్నగూడెంలో గ్రామస్తులతో కలిసి బీసీ కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా పల్లెసీమల రూపురేఖలను సమూలంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో రూ.93 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే వంశీ బుధవారం ప్రారంభించారు. రూ.38 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 24 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, సింగన్నగూడెంలో సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే వంశీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ కేంద్రాలకు శాశ్వత భవనాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కసుకుర్తి స్వరూపరాణి, మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల అధ్యక్షులు తలారి ఈశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాపరిషత్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం గురువారం బందరు పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన జరుగుతుందని కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ పుహాల్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ముఖ్యమైన ఘటనలు వెంటనే తెలియజేయండి

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎక్కడైనా ముఖ్యమైన ఘటనలు జరిగితే వెంటనే తనకు తెలియజేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ భవనాల ప్రారంభం, ఓటర్ల జాబితా, జగనన్న ఆరోగ్య సురక్ష, ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలపై దాడులు, మృతుల వంటి ముఖ్యమైన ఘటనలు జరిగినప్పుడు సంబంధిత ఎంపీడీఓలు, తహసీల్దార్లు వెంటనే ఆ సమాచారాన్ని తెలియజేయాలన్నారు. జిల్లాలో ఏదైనా ప్రభుత్వ శాఖ ప్రత్యేకించి ఇంజినీరింగ్ అధికారులు వారి పరిధిలో ప్రజాప్రతినిధులు పాల్గొనే భవన ప్రారంభోత్సవ వివరాలను ముందుగా కలెక్టరేట్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ నెల 27వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలు ఏఈఆర్‌ఓలు కలెక్టరేట్‌కు వచ్చి తీసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులకు అప్పగించి 27వ తేదీన ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రచురించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి వారి నుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ల జాబితాపై ఇచ్చిన దరఖాస్తులను నవంబర్ 20వ తేదీలోగా అప్‌డేట్ చేయాలన్నారు. మచిలీపట్నం నగరంలో రహదారులపై ఎట్టి పరిస్థితుల్లో పశువులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా వీటిపై సమగ్ర ప్రణాళిక అమలు చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పి.రోజా తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు మొదటిదశ పరిశీలన కార్యక్రమాన్ని కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం సాయంత్రం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల పరిశీలన కార్యక్రమం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరగాలని, పార్టీ ప్రతినిధులంతా తప్పక హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. గుర్తింపుకార్డులు లేకుండా అనుమతించేది లేదన్నారు. భద్రత సిబ్బంది పరిశీలన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.